క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

వేమూరు: విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కోసం శనివారం జంపని రోడ్డు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రీసర్వే త్వరగా పూర్తిచేయాలి

వరహాపురం(వేమూరు): భూ రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సుశీల చెప్పారు. వేమూరు మండలం వరహాపురం గ్రామంలో శుక్రవారం రీసర్వేపై అధికారులతో, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ వరహాపురంలో రెండో విడత రీసర్వే చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ డి.నాగేశ్వర రావు, గ్రామ రెవెన్యూ అధికారి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లూరు : పొరపాటున మంచినీరుగా భావించి సీసాలోని గడ్డి నిర్మూలన మందును తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గాజుల్లంకకు చెందిన బొమ్మసాని శ్రీనివాసరావు (44) ఈనెల 21 రాత్రి కూల్‌డ్రింక్ సీసాలో పోసి ఉంచిన గడ్డి నిర్మూలన మందును పొరపాటుగా మంచినీరుగా భావించి తాగాడు. మందు ప్రభావం వల్ల అస్వస్థతకు గురైన శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో గురువారం మధ్యాహ్నం బాధితుడు మృతి చెందాడు. దీనిపై వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎస్ఐ జి.ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. శుక్రవారం మృతదేహానికి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



నిజాంపట్నం: మండలంలోని పట్టపువారి పాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న డొక్కు శేష గిరిరావు (55) శుక్రవారం తెల్లవారుజామున రేపల్లె పట్టణంలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. నిజాంపట్నం మండలంలోని కొమరవోలు, నిజాంపట్నం పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా శేషగిరిరావు పనిచేశారు. ఆయనకు భార్య రాజేశ్వరి, కుమార్తె కలరు. ఆయన మృతిపట్ల యూటీఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం తోపాటు సీపీఎం భవిష్య కార్యాచరణ ప్రణాళికపై ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులో నిర్వహించే పార్టీ 27వ మహాసభలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌లను శుక్రవారం ఆయన విడుదల చేసి అనంతరం మాట్లాడారు. నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలో ప్రజాసమస్యలపై పలు తీర్మానాలు చేస్తామని,, రాబోయేకాలంలో రాష్ట్రంలో నిర్వహించే పోరాటాలకు ప్రణాళికను రూపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.ఆశీర్వాదం, కె.వి.లక్ష్మణరావు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణం ప్రారంభం



అమర్తలూరు(వేమూరు) ప్రభుత్వం పాఠశాలల అబివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులు ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రహరీ నిర్మాణం పనులు చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబటి రామమోహనరావు, మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ వినయబాబు, ప్రధానోపాధ్యాయులు కనపరీ నిరీక్షణరావు, పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, మధు, ఆనంద్, గిరి, పోతురాజు, శాంతి, అనురాధ సూర్యశ్రీ, రత్న కుమారి, రత్న జయశ్రీ పాల్గొన్నారు.

మినుముకు పల్లాకు పరాకు

- దిగుబడిపై చూపనున్న ప్రభావం
- ఆందోళనలో రైతులు



రేపల్లె మండలం పెనుమూడి వద్ద మినుము పంటకు ఆశించిన పల్లాకు తెగులు



పిచికారి

రేపల్లె రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు ఇబ్బందులు తప్పటంలేదు. కర్షకులను ఓ వైపు ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంటే మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ళు వెంటాడుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగులో ఆశించిన దిగుబడులు రాక రబీ సీజన్‌పై రైతులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. రబీ సీజన్‌లో ఎన్నో ఆశలతో చేపట్టిన మినుము పంటను తెగుళ్ళు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం పల్లాకు తెగులు ప్రభావం చూపుతోంది. ఈ రబీ సీజన్‌లో రేపల్లె సబ్ డివిజన్‌లో పలువురు రైతులు మొక్కజొన్న పంటను సాగు చేయగా మరికొందరు మినుము పంటను సాగు చేస్తున్నారు. మొక్కజొన్నకు నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో మినుము పంట సాగుకు సమాయత్తమయ్యారు. రేపల్లె వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఈ రబీలో 1,500 హెక్టారులకుపైగా రైతులు మినుము పంటను సాగుచేస్తున్నారు. మండలంలోని పెనుమూడి, పేటేరు, చాట్రగడ్డ, రుద్రవరం, కారుమూరు, మోర్లవారిపాలెం, పిరాట్లంక తదితర గ్రామాలలో రైతులు అధిక సంఖ్యలో మినుము సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో మినుము పంటకు పల్లాకు తెగులు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవటంతో అప్పులు చేసి ఖరీఫ్‌ను పూర్తిచేసిన రైతులకు రబీ సాగులోనూ నిరాశ తప్పటంలేదు.

నివారణ మార్గాలు

- పల్లాకు తెగులు సోకిన మొక్కలను మొదట్లోనే గుర్తించి మొక్కను పీకి నాశనం చేయాలి.
- ఒక లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేప నూనె గాని, 5శాతం వేప గింజల కషాయం గాని కలిసి చేసుకోవాలి.
- పూత దశలో ఆశించే బూడిద తెగులు నివారణకు థయోఫిన్‌మిథైల్ 1 గ్రామనుగాని, డైఫెన్ కాన్‌జెల్‌ను 1 మిల్లీలీటరుగాని లీటరు నీటికి కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- పల్లాకు తెగులు వ్యాప్తి చేసే వాహకాలైన తెల్లదోమను నివారించుకోవాలి. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5మిల్లీలీటర్లుగాని, మోనో క్రోటోఫాస్ 2 మిల్లీలీటర్లుగాని ఒక లీటరు నీటిలో కలిసి పిచికారి చేసుకోవాలి. దీంతో దోమ ఉధృతి తగ్గుతుంది.

పర్యవేక్షిస్తున్నాం



వ్యవసాయ సబ్ డివిజన్‌లో మినుము సాగు చేస్తున్న పొలాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పల్లాకు తెగులుతోపాటు పలు రకాల తెగుళ్ల నివారణకు ఇప్పటికే రైతులకు వివరించాం. రైతులు సైతం సాగులో సమస్యలు ఉంటే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలి.

– ఆర్.విజయ్‌బాబు,
మండల వ్యవసాయ అధికారి, రేపల్లె

అక్రమ లేఅవుట్లలో కార్యకలాపాలు ఆపాలి

తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్



అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్‌పై వ్యాపారిని ప్రశ్నిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు : నిబంధనలను అతిక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్లలో కార్యకలాపాలు తక్షణం నిలుపుదల చేయాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం 'సాక్షి'లో ల్యాండ్ కన్వర్షన్ చేపట్టకుండా, సీఆర్‌డీఏ నిబంధనలను అతిక్రమించి చేపట్టిన లే అవుట్లపై 'ల్యాండ్ కన్వర్షన్‌లు నిల్.. ఆదాయం ఫుల్' శీర్షికన ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం కొల్లూరు పెట్రోల్ బంక్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్‌ను ఆయన పరిశీలించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్కడ చేపడుతున్న పనులను తక్షణం నిలుపుదల చేయాలని ఆదేశించారు. ల్యాండ్ కన్వర్షన్ చేపట్టకపోవడంతోపాటు, నిబంధనలను అతిక్రమించి లే అవుట్ ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోని పక్షంలో పెనాల్టీతో సహా ప్రభుత్వానికి నగదు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ అంశంపై తహసీల్దార్ మాట్లాడుతూ, ల్యాండ్ కన్వర్షన్ లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ విషయంలో కఠిన చర్యలు చేపడతామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి గురువారం ఆన్‌లైన్ విధానంలో భూమి సర్వే నంబర్ సబ్ డివిజన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ల్యాండ్ కన్వర్షన్‌నూ వెంటనే చేయించుకోవాలని ఆదేశించడంతో శుక్రవారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన భూమి మార్కెట్ విలువలోని 3 శాతం నగదు రూ.76 వేలు చెల్లించారన్నారు. అయినప్పటికీ ల్యాండ్ కన్వర్షన్ పూర్తయ్యే వరకు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకూడదని ఆదేశించామని తహసీల్దార్ వివరించారు.

లింగ సమానత్వంపై అవగాహన కల్పించాలి



అనంతవరం జెడ్పీహెచ్ పాఠశాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి



చావలిలో మాట్లాడుతున్న అమృతవాణి

కొల్లూరు : సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలంటే చిన్న వయస్సు నుంచి తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయులు బాలురకు లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని అమృతలూరు ఐసీడీఎస్ సీడీపీఓ జి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అనంతవరం జెడ్పీహెచ్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత చదువులు చదివిన పక్షంలో సమాజంలో తమ కాళ్లపై తాము నిలబడి సమస్యలను అధిగమించడానికి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా, మహిళా సాధికారత అంశాలపై విద్యార్థినులకు వివరించారు. అనంతరం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి, ఏఎన్ఎం పీఎస్‌టీ కుమారి పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి పనిచేయాలి

నిజాంపట్నం: బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఐసీడీఎస్ పల్లపట్ల సెక్టార్ సూపర్‌వైజర్ బి.జ్యోతిలక్ష్మి కోరారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రజ్ఞం హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించటం సాధ్యమని, బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాలలకు వచ్చి వెళ్ళే సమయంలో ఎవరైనా వెంబడించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు నిర్భయంగా తెలియజేయాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఏఎన్ఎం ఫిరోజా, తదితరులు పాల్గొన్నారు.

చావలిలో..

చావలి(వేమూరు) : చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ అమృతవాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శిరీష, భాగ్యలత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, వి.ఆదిశేషమ్మ, లక్ష్మీ నాంచారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో రౌడీషీటర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములనాయక్

తెనాలిరూరల్: యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో తెనాలి ఐతానగర్ కు చెందిన రౌడీషీటర్ నూతలపాటి అరుణ్‌ను టూ టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుడి అరెస్ట్ వివరాలను సీఐ కె రాముల నాయక్ తెలియజేశారు. మల్లెపాడుకు చెందిన శ్రీరామ్ రాజు పట్టణంలోని ప్రకాశంరోడ్డులో సమోసాల బడ్డీ నిర్వహించుకుంటూ ఉంటాడు. అతని భార్య లక్ష్మీ నెహ్రూరోడ్డులోని హాస్పటల్ వద్ద సమోసాల బడ్డీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం శ్రీరామ్ రాజు తన భార్య సమోసాల బడ్డీ వద్ద ఉండగా రౌడీ షీటర్ నూతలపాటి అరుణ్ వచ్చి యువ కుడిని బలవంతంగా బండిపై తీసుకు వెళ్లాడు. తాను పిలిచినప్పుడల్లా బండిమీద డ్రాప్ చేసేందుకు ఎందుకు రావడం లేదంటూ యువకుడు శ్రీరామ్ రాజుపై రౌడీషీటర్ అరుణ్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు శుక్రవారం అరుణ్ ను అదుపులోకి తీసుకొని హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సత్ప్రవర్తన నిమిత్తం తహశీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నామని, రౌడీ షీటర్లు తమ ఉనికి చాటుకునేందుకు ఇలాంటి దాడులకు పాల్పడితే సహించేది లేదని సీఐ రాముల నాయక్ హెచ్చరించారు. పట్టణంలో ఏ ఘర్షణ జరిగినా ఐతానగర్ పేరు ఎక్కువగా వినిపిస్తోందని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్ఐలు అమరలింగేశ్వరరావు, హైమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం



కుచ్చెళ్లపాడు(వేమూరు): పశువులకు వచ్చే వ్యాధులను నివారించేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరైతు అనురాధ చెప్పారు. వేమూరు మండలం కుచ్చెళ్లపాడులో పశు వైద్య శిబిరం శుక్రవారం ప్రారంభించారు. పశు వైద్యాధికారి యశ్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వం పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తుందని వివరించారు. కుచ్చెళ్లపాడులో 32 పశువులకు సాధారణ పరీక్షలు, 30 పశువులకు గర్భకోశ పరీక్షలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించారు. ఇంకా పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌కే అభిజిత్, జేవీఓ కె.సాయి పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



రేపల్లె రూరల్: నెహ్రూ యువకేంద్రం గుంటూరు, అహ్మదీయ ఎడ్యుకేషన్ సొసైటీల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం వివిధ కళాశాలల విద్యార్థులకు బ్లాక్ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం, బ్యాడ్మింటన్ అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవి చంద్ర కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అహ్మదీయ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ సయ్యద్ తాహర్ అహమ్మద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాపట్లటౌన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యరాణి తెలిపారు. మాస్టర్ చెఫ్ నారాయణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు పోషకాహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. శుక్రవారం విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన పోషకాహార పదార్థాలు, వాటిని తయారు చేసేందుకు ఉపయోగించిన పప్పుధాన్యాలు, తయారీ విధానం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థులు ధరించిన దుస్తులు పర్యావరణానికి హాని కలిగించని పేపర్‌తో తయారు చేసినవని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏవో సాంబశివరావు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య చెప్పారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని చిల్లరగొల్లపాలెం మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ, బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొచ్చర్ల వినయ్‌రాజు, పాఠశాల హెచ్‌ఎం నున్నం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన అవసరం

- జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్
- బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకం ఆవిష్కరణ



బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో రూపొందించిన బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు రాజ్యంగంపై అవగాహన కల్పించే విధంగా దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ నిర్వాహకులు పుస్తకాన్ని తయారు చేయటం హర్షణీయమన్నారు. పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ ప్రవేశిక లక్ష్యాలు అర్థమయ్యే విధంగా చిత్రాలతో రూపొందించారన్నారు. విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తిని రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచిన పదాల అర్థాలు తెలియజేసే విధంగా బొమ్మలతో రూపొందించిన పుస్తకం అద్భుతంగా ఉందన్నారు. డీబీఆర్‌సీ ఏరియా కో–ఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించిన రాజ్యాంగంలో పౌరులందరికీ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కల్పించారని వివరించారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు హక్కులు కల్పించినట్టు వెల్లడించారు. రాజ్యాంగ పీఠిక రాజ్యాంగ స్ఫూర్తిని తెలియజేస్తుందని, అందుకే డీబీఆర్‌సీ పీఠికలోని అంశాలను విద్యార్థి లోకానికి తెలియజేసే లక్ష్యంగా ఫొటోలను రూపొందించి అన్ని జిల్లాలలోని విద్యా సంస్థల్లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్‌రావు, డీబీఆర్‌సీ ప్రతినిధులు డానీ, ఎన్.శ్రీలత పాల్గొన్నారు.

దోమలను అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తదితరులు

రేపల్లె రూరల్: దోమల ఉధృతిని అరికట్టేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని 22, 23, 24 వార్డులలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ నివాస గృహాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పూల కుండీలు, పాతటైర్లు, పనికిరాని కూలర్లు, ఫ్రిజ్‌లలో ఉన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. నీటి నిల్వలు పెరుకుపోతే దోమల ఉధృతి అధికమై అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలోని మురుగు కాల్వలలో యాంటీ లార్వా ఆయిల్ స్ప్రే చేసి నీటి కుంటలలో ఆయిల్ బాల్స్ వేయించారు. డ్రైడే–ఫ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వైవి కృష్ణయ్య, సూపర్‌వైజర్ ఎం.ఎల్లయ్య, శానిటరీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చిన్నారి పవన్‌కు మంత్రి అనగాని అభినందన



చిన్నారిని అభినందిస్తున్న రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: పిన్నవయస్సులో అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారి పవన్‌ను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. పట్టణానికి చెందిన కొత్తమాసు మోహన్ కల్యాణ్, మధులత రెండేళ్ళ కుమారుడు పవన్ ఇన్‌జెన్యూస్ చామ్స్ వరల్డ్ రికార్డ్ (ఐసీడబ్ల్యూఆర్) సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం టీడీపీ కార్యాలయంలో చిన్నారిని, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారి పవన్ 1.30 గంటలలో 40 దేశాల జెండాలను గుర్తించటంతోపాటు, పలు శ్లోకాలను పాడగలడని, పలు పదాల అబ్రివేషన్‌లు తెలపగలడని తల్లిదండ్రులు మంత్రికి వివరించారు.

రక్తదాన శిబిరం

మాజీమంత్రి పరిటాల రవీంద్ర జయంత్యుత్సవం సందర్భంగా పట్టణంలోని పరిటాల యువసేన కార్యాలయంలో పరిటాల యువసేన పట్టణ అధ్యక్షుడు దండమూడి ధరణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో కృష్ణా పశ్చిమ డెల్టా చైర్మన్ పంతాని మురళీధర రావు, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, దేవగిరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో పలువురు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి అనగానికి వినతిపత్రాలు అందజేశారు.

రైతుల పక్షాన పోరాడిన యోధుడు బావిరెడ్డి



బావిరెడ్డి స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కొల్లూరు : చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడి భూములు సాధించడంలో కీలక పాత్ర పోషించిన పోరాట యోధుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఆవులవారిపాలెం–పెసర్లంక అడ్డరోడ్డు వద్ద ఉన్న బావిరెడ్డి స్మారక స్థూపం వద్ద నిర్వహించిన ఆయన 45వ సంస్మరణ సభలో సింగరకొండ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి పోరాటాలు చేస్తూ చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేసి జైళ్లకు వెళ్లిన వ్యక్తి బావిరెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రజా పోరాటాలలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమర్తలూరి కృపానందం, సీపీఐ, సీపీఎం నాయకులు గంట రాంబాబు, సనక అగ్గిరామయ్య, బీసీ సంఘాల నియోజకవర్గ నాయకుడు మురాల వాసుదేవ్‌గౌడ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణపై కేసు

తెనాలిరూరల్: బైక్ అపహరణకు గురవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గత అక్టోబరు 30న తెనాలి రైల్వేస్టేషన్ ఐదో నంబరు ప్లాట్‌ఫాం వైపును తన బైక్‌ను నిలిపి వెళ్లాడు. తిరిగి వచ్చే చూడగా వాహనం కనబడలేదు. ఇన్నాళ్లు గాలించి చివరకు పోలీసులను ఆశ్రయించగా, త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.